రాష్ట్రంలోనే మొదటి జడ్పీ భవనం ప్రారంభం

- అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణానికి మరిన్ని నిధులు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తాం
- తెలంగాణలో తలమానికంగా తీర్చిదిద్దుతాం
- అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

ప్రారంభోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చిత్రంలో జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి, కలెక్టర్

వికారాబాద్, జూన్ 26 : తెలంగాణ రాష్ట్రంలో జడ్పీ భవనం మొదటిసారిగా వికారాబాద్‌లోనే ప్రారంభించడం జరిగిందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. బుధవారం వికారాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. వికారాబాద్ జడ్పీ భవనాన్ని తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా తీర్చిదిద్దుతామన్నారు. భవనాన్ని మరో 6 లేదా 8 నెలల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేసిన జడ్పీ చైర్‌పర్సన్‌ను కొనియాడారు. రాజకీయంగా వారి అనుభవాలను, ప్రజల మధ్యనే ఉంటూ ప్రజలకు సేవలందించాలని సూచించారు. అధికారులు ప్రొటోకాల్ పాటించాలని, ప్రజాప్రతినిధులను స్టేజీ పైకి పిలువాలన్నారు. ఏ సమావేశం ఏర్పాటు చేసినా జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీలను ఆహ్వానించాలని స్పీకర్ సూచించారు.

జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూ.. జడ్పీ భవన నిర్మాణానికి రూ.5.15 కోట్లు, మూడున్నర ఎకరాల స్థలంలో నిర్మించడం జరుగుతుందని తెలిపారు. హ్యూమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్‌లో ఉన్న నిధులు రూ.3కోట్లు జిల్లా పరిషత్ భవన నిర్మాణానికి కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. గ్రామాల్లో జడ్పీటీసీలు అభివృద్ధి పనులు పూర్తి చేశారని.. వారికివ్వాల్సిన నిధులు ఇంకా దాదాపు రూ.5 నుంచి 6 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు.

మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జడ్పీ భవనానికి ప్రహరీ, గ్రౌండ్ ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు.

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 33 జిల్లాల్లో ఏర్పాటు కాని జడ్పీ భవనం వికారాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సమస్యలను స్పీకర్, సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పలు అభివృద్ధి పనులు చేశారని వివరించారు. అసంపూర్తిగా ఉన్న జడ్పీ భవనాన్ని ఇంత తొందరగా ప్రారంభించడం సరికాదన్నారు. భవనం పూర్తి చేసిన తరువాత ప్రారంభిస్తే బాగుండేదన్నారు.

కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ భవనం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. 14 మంది ట్రాన్స్‌జెండర్లకు ధ్రువపత్రాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. వీరు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలకు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీడీవోలు, జిల్లా అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న జడ్పీ భవన నిర్మాణానికి ప్రారంభోత్సవం

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

రక్తహీనతను అరికట్టాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూన్ 26 : జిల్లాలోని చిన్నారుల్లో రక్తహీనతను సమూలంగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరికి ఐరన్, పోలిక్ యాసిడ్ టాబ్లెట్లను వేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ఆరోగ్య విద్యా శాఖ, సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 75 శాతం మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారని, 1062 స్కూళ్లలోని 5-19 సంవత్సరాల పిల్లలందరికీ అన్ని శాఖల సమన్వయంతో ఐరన్, పోలిక్ యాసిడ్ టాబ్లెట్లు అందజేయాలన్నారు. ప్రతి గురువారం ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ రిజిస్టర్‌లో పేర్లు రాసి ఉదయం బ్రేక్ ఫాస్ట్ అయిన తర్వాత ఈ టాబ్లెట్లను వేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. పీహెచ్‌సీ అధికారి మానిటర్ చేస్తూ ప్రతి స్కూల్‌కు వెళ్లి టాబ్లెట్లను వేసేందుకు చర్యలు తీసుకోవాలలని ఆదేశించారు. 5-11 ఏండ్ల పిల్లలకు 45 ఎంజీ, 11-19 వయస్సువారికి 60 ఎంజీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గురువారం రానివారికి మరుసటి రోజు వేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇంటర్మీడియట్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకాదేవి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి మల్లేశం, డీవైఎస్‌వో హనుమంతరావు పాల్గొన్నారు.

పాత హైవేపై కొత్తూరు పట్టణంలో మిగిలిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పనులను త్వరలోనే ప్రారంభిస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రూ.5 కోట్లతో కొత్తూరు వై జంక్షన్ నుంచి రైల్వే బ్రిడ్జి వరకు సీసీ రోడ్డు

కొత్తూరు, జూన్ 26 : రూ.5 కోట్లతో కొత్తూరు వై జంక్షన్ నుంచి రైల్వే బ్రిడ్జి వరకు సీసీ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పాత హైవేపై కొత్తూరు పట్టణంలో మిగిలిపోయిన రోడ్డును ఆర్అండ్‌బీ అధికారులు, గ్రామ పెద్దలతో కలిసి బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వై జంక్షన్ నుంచి రైల్వే బ్రిడ్జి వరకు హైవే పనులను సాధ్యమైనంత త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. రెండు వైపులా 30 ఫీట్లు ఉండేలా రోడ్డును నిర్మిస్తామని చెప్పారు. మధ్యలో డివైడర్, బట్టర్‌ఫ్లై లైట్లను ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో వ్యాపారస్తులకు కూడా నష్టం జరుగదని వివరించారు. ఇరువైపులా డ్రైనేజీ కూడా నిర్మిస్తామన్నారు. వ్యాపారస్తులు, నాయకుల సలహాలు, సూచనలు తీసుకొని ముందుకెళ్తామని వివరించారు. అలాగే నూతనంగా నిర్మించిన లైబ్రరీని కూడా పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు రావాల్సిన డబ్బులు త్వరలో ఇప్పిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, దేవేందర్, జగన్, మాజీ ఎంపీపీలు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి

వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి

వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, పోలీసులు

వికారాబాద్, జూన్ 26 : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్ కోసం బాటలు వేసుకోవాలని వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తా నుంచి పెట్రోల్‌పంప్ వరకు మాదకద్రవ్యాల నిరోధం అనే అంశంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ఒక్క రోజు ర్యాలీ నిర్వహించి మరిచి పోకుండా మాదక ద్రవ్యాల నిర్మూలనకు నడుం బిగించాలని కోరారు. చదువుకునే వయసులో యువత చెడు వ్యసనాలకు గురికాకుండా క్రమశిక్షణతో మంచి ఆశయాలతో భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలతో ఎంతోమంది జీవితాలు మధ్యంతరంగా ముగిసిపోతున్నాయని, వాటిని పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడడంతో ఆరోగ్యం క్షీణించడంతో పాటు అది ఒక వ్యసనంగా మారుతుందని, నేర ప్రవృత్తి వైపు దారితీస్తుందన్న విషయం గమనించాలని పేర్కొన్నారు. తద్వారా కుటుంబ సభ్యుల సంబంధాలకు దూరమవుతారని, కుటుంబం ఆర్థిక పరిస్థితులతోపాటు, దేశ ఆర్థిక వ్యవస్థ కూడా చిన్నాభిన్నమవుతాయన్నారు. మాదకద్రవ్యాలకు బానిస కాకుండా ఆదిలోనే తుంచివేయాలని కోరారు. ఎవరైనా నిషేధిత మాదక ద్రవ్యాల యొక్క సమాచారాన్ని తెలియజేస్తే.. వారి వివరాలు గోప్యంగా ఉంచి ఆ వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, వికారాబాద్ సీఐ నాగరాజు, ధారూరు సీఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భాస్కర్‌రావు విగ్రహానికి నివాళులర్పించిన చినజీయర్‌స్వామి తదితరులు

జోగినిపల్లి భాస్కర్‌రావు గొప్ప విద్యా ప్రదాత

త్రిదండి చినజీయర్‌స్వామి

మొయినాబాద్, జూన్ 26 : జోగిన్‌పల్లి భాస్కర్‌రావు పెద్ద విద్యా సంస్థను స్థాపించి ఎంతో మందికి ఉజ్వల భవిష్యత్తును అందించిన గొప్ప విద్యా ప్రదాత అని త్రిదండి చినజీయర్‌స్వామి అన్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ రెవెన్యూలోని భాస్కర జనరల్ ఆసుపత్రిలో భాస్కర విద్యా సంస్థల చైర్మన్ దివంగత భాస్కర్‌రావు 10వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చినజీయర్‌స్వామి పాల్గొని భాస్కర్‌రావు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాస్కర్‌రావు ఇంజినీరింగ్ కళాశాలతో మొదలుపెట్టి నేడు మెడికల్, డెంటల్, లా కాలేజీలను స్థాపించి పెద్ద విద్యా సంస్థగా రూపొందించారని చెప్పారు. విశాలమైన ప్రాంతంలో విద్యా సంస్థను నెలకొల్పి విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించారని ఆయన పేర్కొన్నారు.

అనుమతుల్లో జాప్యం వద్దు

సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ): భవన నిర్మాణం, లే అవుట్ల అనుమతుల్లో ఎక్కడా జాప్యం లేకుండా దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని, అనుమతుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుదారులు అనుమతి పొందేలా ప్లానింగ్ విభాగం అధికారులు పనిచేయాలని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సూచించారు. మెట్రోపాలిటన్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన కీలకమైన విభాగాలపై సుదీర్ఘంగా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం పదవీ బాధ్యతలు చేపట్టిన కమిషనర్ మంగళవారం ఇంజినీరింగ్ విభాగంపైనా, బుధవారం ప్లానింగ్ విభాగంపై ఎక్కువ సమయం సమీక్షించారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏలో ప్లానింగ్ విభాగం పరిధి, ఏ ప్రాంతం నుంచి ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని, ఎలాంటి దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయని తెలుసుకున్నారు. మొత్తం 4 జోన్‌లైన శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్‌లలో ఎక్కువగా శంకర్‌పల్లిలో హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులతో పాటు భవన నిర్మాణాలు, లేఅవుట్ల కోసం దరఖాస్తులు రాగా, ఆ తర్వాత శంషాబాద్, మేడ్చల్‌లు ఉన్నాయి. ప్రణాళిక విభాగంలోని ప్లానింగ్ ఆఫీసర్స్‌తో పాటు జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్స్(జేపీవో), అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్(ఏపీవో)ల పనితీరు ఎలా ఉందని ఆరా తీశారు జోన్‌ల వారీగా అనుమతుల జారీ ఎలా ఉందన్న దానిపైనే ప్లానింగ్ విభాగం డైరెక్టర్లతో చర్చించారు. జీహెచ్ఎంసీ తర్వాత గ్రేటర్ చుట్టూ ఉన్న ప్రాంతాల్లో పట్టణీకరణ శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఇండ్ల నిర్మాణాలు గణనీయంగా పెరుగుతున్నాయని, అవన్నీ హెచ్ఎండీఏ పరిధిలోకే వస్తాయని తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి

వికారాబాద్, జూన్ 26 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ వికారాబాద్ పట్టణ కార్యదర్శి మహేశ్‌సాగర్ అన్నారు. బుధవారం ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వికారాబాద్‌లోని పాఠశాలలను బంద్ చేసి రోడ్డుపై విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా విద్యారంగ సమస్యలు మారడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న సమస్యలే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా రావడం సిగ్గుచేటన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంవత్సరాల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, సమస్యలపై నిత్యం విద్యార్థి పరిషత్ నుంచి అధికారులకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక, సరిపడ అధ్యాపకులు లేక నానా అవస్థలు పడుతుంటే.. మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు లక్షలకు లక్షలు ఫీజులు దండుకుంటున్న వైనాన్ని పట్టించుకోనటువంటి ప్రభుత్వం కేవలం చర్యలు తీసుకుంటామంటూ హామీలు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నదని మండిపడ్డారు. అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటామంటూ, ఫీజు నియంత్రణ చట్టం అమలు చేస్తామంటూ హామీలు ఇస్తున్నారు తప్ప అమలు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైన ప్రభుత్వ తీరును నిరసిస్తూ పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సంయుక్త కార్యదర్శి జగదీశ్‌చారి, నాయకులున్నారు.

అధిక సాంద్రతలో పత్తి సాగు రైతులకు లాభదాయకం

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్‌కుమార్, సుధీర్

ఆమనగల్లు, జూన్ 26 : అధిక సాంద్రతలో పత్తి సాగు రైతులకు లాభదాయకమని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్‌కుమార్, సుధీర్, వ్యవసాయ సహాయ సంచాలకులు ఆదిలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పత్తిలో అధిక సాంద్రత సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని భూస్థితిని బట్టి సరైన మోతాదులో సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటలలో అధిక దిగుబడి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏవో అరుణకుమారి, ఏఈవోలు సాయిరాం, మీనాక్షి, రాణి, శివతేజ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్

రాచకొండ మైలారం సహకార సంఘానికి

ఉత్తమ అవార్డు

- రుణాల వసూళ్లలో జిల్లాలోనే నం.1
- రైతులకు సకాలంలో రుణాలు అందించడం లోనూ అగ్రస్థానమే..

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 26 : రైతులకు ఎప్పటికప్పుడు పంట రుణాలు, వ్యవసాయ ఆధారిత రుణాలు అందజేస్తూ.. ఇచ్చిన రుణాలను ఎప్పటికప్పుడు రైతుల నుంచి వసూలు చేయడంలో జిల్లాలోనే రాచకొండ మైలారం సహకారసంఘం అగ్రభాగాన నిలిచింది. దీంతో బుధవారం రాచకొండ మైలారం సహకార సంఘానికి రుణాల రికవరీ ఉత్తమ అవార్డును సంఘం చైర్మన్ బిట్ల వెంకట్‌రెడ్డికి డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య నగరంలోని సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో అందజేశారు. రాచకొండమైలారం ప్రాంతంలోని రైతులకు ఉత్తమ సేవలందిస్తున్న సొసైటీకి ఉత్తమ అవార్డు రావడం ఎంతో గర్వకారణమని పాలకవర్గం, సిబ్బందితోపాటు పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చైర్మన్ వెంకట్‌రెడ్డికి ఉత్తమ రికవరీ అవార్డు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

నాలుగేండ్లలో రూ.10 కోట్లకు పెరిగిన సంఘం ఆస్తులు

రాచకొండ మైలారం సహకార సంఘానికి గతంలో గోదాం నిర్మాణానికి సెంటు భూమి కూడా లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో గ్రామంలో 100 చ.గజాల స్థలం తీసుకుని 500 మెట్రిక్ టన్నుల స్టోరేజీ గోదామును నాబార్డు వారి సౌజన్యంతో హెచ్‌డీసీసీబీ ద్వారా నిర్మించారు. దండుమైలారం రెవెన్యూ పరిధిలో 3.20 ఎకరాల స్థలం రాబట్టి త్వరలోనే ఆ స్థలంలో గోదాముతో పాటు ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. రాయపోల్ గ్రామంలో 200 గజాల స్థలం పొంది రైతుల సౌకర్యార్థం ఇక్కడ కూడా మరో గోదాము నిర్మించనున్నారు. దీంతో రాచకొండమైలారం సహకారసంఘానికి సుమారు రూ.10కోట్ల ఆస్తులు పెంచినట్లు చైర్మన్ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఉత్తమ రికవరీ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నష్టాల్లో ఉన్న సంఘాన్ని లాభాల్లో నడిపించేందుకు కష్టపడి పనిచేశాం. రైతులకు రుణాలు అందించి ఎప్పటికప్పుడు రికవరీ చేయడంలో మా సిబ్బందితో పాటు మేము ఎంతో కృషిచేసి నాలుగేండ్లలో నష్టాల్లో ఉన్న సంఘాన్ని లాభాల బాటలోకి నడిపించాం. రైతులు తీసుకున్న రుణాలు ఎప్పటికప్పుడు చెల్లించడంలో ప్రత్యేక అవగాహన కల్పించాం. కష్టానికి ఫలితంగా ఉత్తమ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది.

- వెంకట్‌రెడ్డి, రాచకొండమైలారం సహకార సంఘం చైర్మన్

మంగళవారం తన మిత్రుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకొంటున్న మల్లేశ్

పుట్టిన రోజు సందర్భంగా దావత్ ఇచ్చేందుకు వెళ్లి

తిరిగిరాని లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


మృతుడు మల్లేశ్ (ఫైల్)

కులకచర్ల, జూన్ 26 : తన పుట్టిన రోజును ఘనంగా చేసుకున్న యువకుడు తన స్నేహితులకు పుట్టిన రోజు దావత్ ఇచ్చేందుకు మరుసటి రోజు వెళ్లగా.. రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. కులకచర్ల పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం కిషన్‌గూడ గ్రామానికి చెందిన మల్లేశ్(24) ఈ నెల 25న తన పుట్టిన రోజు వేడుకలను కుటుంబసభ్యులు, స్నేహితులతో జరుపుకొన్నాడు. పుట్టిన రోజు సందర్భంగా తన స్నేహితులకు దావత్ ఇచ్చేందుకు మరుసటి రోజు వికారాబాద్ జిల్లా పోలెపల్లికి వెళ్లాడు. అక్కడి నుంచి బుధవారం సాయంత్రం తిరుగు ప్రయాణంలో కులకచర్లకు వచ్చాడు. అనంతరం కులకచర్లలో కాల్చిన చేపలను తీసుకొని ఇప్పాయిపల్లి సమీపంలో తన స్నేహితులతో దావత్ చేసుకున్నాడు. దావత్ ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్లేందుకు తన స్నేహితులు ఒక బైక్‌పై వెళ్లగా.. మల్లేశ్ తన బైక్‌పై వంద మీటర్ల దూరం వచ్చి అక్కడే ఉన్న విద్యుత్ స్తంభానికి బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికులు గమనించి వెంటనే ఆంబులెన్స్‌కు ఫోన్ చేశారు. కులకచర్ల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మల్లేశ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మల్లేశ్‌కు భార్య, కూతురు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మల్లేశ్ మంగళవారం రోజు పుట్టిన రోజు వేడుకలు జరుపుకొని మరుసటి రోజే మృత్యుఒడిలోకి వెళ్లడం పలువురిని కలచివేసింది.

రైతు ఆత్మహత్యాయత్నం

శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నిస్తున్న రైతు సురేశ్‌బాబును అడ్డుకుంటున్న పోలీసులు

శంషాబాద్ రూరల్, జూన్ 26 : రెవెన్యూ అధికారులు తమ సమస్యలు పట్టించుకోవడం లేదంటూ.. బుధవారం ఓ రైతు శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నించడం శంషాబాద్‌లో కలకలం సృష్టించింది. బాధిత రైతు సురేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం శంకరాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్య- కమలమ్మకు ఘాన్సీమియాగూడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 4/7, 4/8లో 8 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నది. గతంలో పట్టాభూమిగా ఉన్న ఈ స్థలం ప్రస్తుతం సీలింగ్‌గా మార్చడంతో రైతు బంధు, రైతు బీమా పథకాలు రావడం లేదని వీరి కుమారుడు సురేశ్‌బాబు తెలిపారు. 9 నెలల కిందట తన తల్లి కమలమ్మ పేరున ఉన్న భూమి రికార్డులు ధరణిలో తప్పుగా వచ్చిందన్నారు. దీంతో తాము తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నామని, అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారులు మా సమస్యను పరిష్కరించడం లేదంటూ సురేశ్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, సురేశ్‌బాబు ఆత్మహత్యకు యత్నించడంతో ఒక్కసారిగా శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొన్నది. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తన సిబ్బందితో చేరుకొని సురేశ్‌బాబుకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. అయితే ఈ విషయంపై అధికారులు మాత్రం తమకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారు.

జూలై 1న గోర్ బంజారా జాతీయ సమ్మేళనం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 26: లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో జూలై 1న గోర్ బంజారా జాతీయ సమ్మేళనం రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఎల్ఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు ఎల్ఎస్‌వో ముఖ్య కార్యకర్తల సమావేశం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశానికి అశోక్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గోర్ బోలిని రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూలులో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎస్‌వో నాయకులు విజేందర్‌పవార్, జగదీశ్‌నాయక్, సంతోష్‌నాయక్, వెంకటేశ్ నాయక్, చందర్, గణేశ్, కిషన్, రాజు, జంపన్న, సురేందర్, రవీందర్ పాల్గొన్నారు.